

# ఆశయాలకు ఉరితాళ్ళు

పాలపర్తి ధనరాజ్

‘‘కాఫీ పట్రానాండీ’’? అన్నాడు డ్రాక్యులా.

ఏవో ఫైలు చూస్తున్న నాకు సరిగా వినిపించ లేదు. వినిపించకపోతే వదిలేసే రకం కాదు అతడు. మళ్ళీ అడిగాడు.

ఫైల్లోంచి తల ఎత్తి, ‘‘ఏదో సీరియస్‌గా పని చేస్తున్నప్పుడు కొంచెం కూడా ఆగకుండా అలా విసిగిస్తావేం? ఏమంటావ్? కాఫీనా? పట్రా. తాగక పోతే నువ్వు వదులుతావా?’’ అన్నాను.

ఇక వాడేమీ వినడు. ‘‘కాఫీ పట్రానాండీ’’ అని వినిపించింది నాకు. అప్పుడే పక్క టేబుల్ దగ్గరికి [illegible] నాకు, నా కేసు వినేసి.

[illegible] కోటయ్య. అది వాడి పేరని మా ఆఫీసులో కాఫీలు పట్టుకురావడం ప్రారంభించిన [illegible] కు తెలిసింది. వాడు వచ్చిన మొదటి రోజునే ‘డ్రాక్యులా’ అని బిరుదు ఇచ్చాం. ఎవరో ఇచ్చిన పొడ వాటి షర్టు. అది ‘హాఫ్ హాండ్స్’ షర్టు. అయినా, వాడి కది ‘ఫుల్ స్లీవ్సు’ అయి మణికట్టు మాత్రం కనిపిస్తుంటుంది. క్రింద మోకాళ్ళు దాటిపోయి ఉంటుంది. వాడి వయస్సు కేవలం పధ్నాలుగు సంవత్సరాలు ఉండవచ్చు. చింపిరి జుట్టు. తైల సంస్కారం ఏమాత్రం ఉండదు. చిల్లర వేసుకోవ డానికి చిన్న ఖాకీ సంచి. అది భుజంమీదుగా పక్కకు వేలాడుతూ ఉంటుంది. విశేషమేమిటంటే అది కూడా మోకాళ్ళు దాటి ఉంటుంది. వాడు పెద్ద వాడయిన తరవాత కూడా పనికి వస్తుందని హొటల్ ప్రొప్రయిటర్ కుట్టించి ఉంటాడు. వాడు ‘బాండెడ్ లేబర్.’

దగ్గరలో ఉన్న హొటల్ నుంచి మా ఆఫీసుకు కాఫీలు, టిఫిన్లు తెస్తూంటాడు. తెస్తూంటాడు అనే కంటే మోస్తూంటాడు అంటే బాగుంటుంది. దూరంగా ఘల్లు ఘల్లుమని వినిపిస్తూందంటే చిల్లర సంచీ వస్తూందన్న మాట. అంటే దాని వెనకే డ్రాక్యులా. అంత పరిచయ మయిపోయాడు వాడు. వాడు రాని రోజు మా కేం తోచనట్టు ఉంటుంది. వాడు హొటల్‌కు, మా ఆఫీసుకు తిరిగే దూరం లెక్కవేస్తే చాలా మైళ్ళు రావచ్చు రోజుకు.

• • •

‘‘ఒరే, డ్రాక్యులా! అదిగో, అవతల డ్రాయరు మీద ‘ఆర్డినరీ’ అని వ్రాసి ఉన్న ఫైలు ఇటుందుకో’’ అన్నాను. వాడు అటూ ఇటూ చూశాడు కానీ, కదల లేదు. ‘‘నిన్నేరా. తెలుగులో వ్రాసి ఉంటుంది. అందుకో.’’ రెట్టించాను. తెల్లబోయి చూడటం తప్ప కదలడంలేదు.

‘‘నాకు తెల్దండీ.’’

‘‘తెలుగులోనే వ్రాసి ఉంటుందిరా—తెలియదా?’’

ఒక్క క్షణం నా కళ్ళలోకి తదేకంగా చూశాడు.

అదే క్షణం నేనూ కళ్ళు నిలిపాను.

వాడి కళ్ళలో సన్నని నీటి పొర. దానిలో అసహాయత ఉంది. ఆవేదన ఉంది. ఆవేశం ఉంది.

ఎందుకో తెలివి వచ్చింది నాలో.

''అసలు చదువుకోలేదా నువ్వు?''

''లేదండీ. మా అయ్య, అమ్మ లేరండీ. మా బాబాయి ఉన్నాడండీ. ఆయన ఏ పనీ చెయ్యడండీ. అందుకని నాకు సదువు చెప్పించలేదండీ. హోటల్ వాళ్ళు అన్నీ పెడతారండీ నాకు.''

''మరి, నీకు రోజుకు ఎంత ఇస్తారు?''

''ఇరవై రూపాయల సరుకమ్మితే నాలుగు రూపాయి లిస్తారండీ.''

''నువ్వెంత అమ్ముతావు?''

''చేరాల్సి బట్టండీ. ఒక్కోరోజు గిరాకీగా ఉంటే అరవైదాకా అమ్ముతానండీ.''

''ఎంత మంది బతకాలి దానితో?'' అంటూండ గానే, ఎవరో వాణ్ణి పిలిచారు. వాడు వెళ్ళిపోయాడు.

పధ్నాలుగు సంవత్సరాల వాడు. చదువు లేదు. అప్పుడే వాడు ఒక ఇంటికి సాయపడుతున్నాడు. జీతం తెచ్చుకుంటున్నాడు. నేనూ తెచ్చుకుంటున్నాను జీతం. ఒక రకంగా వాడు నా కొలీగ్ అన్న మాట. ఒక్కటే తేడా—నేను నెల జీతగాణ్ణి; వాడు రోజు వారీ జీతగాడు.

● ● ●

''కాఫీ పట్రానండీ?'' అదే చిరపరిచితమైన కంఠం. డ్రాక్యులాగాడు. వాణ్ణి 'డ్రాక్యులా' అని పిలిస్తే ఆనందంగా పలుకుతాడు. బహుశా 'డ్రాక్యులా' అంటే తెలియకపోవటం మూలంగానేమో? అలా అని ఒక సారి 'డ్రాక్యులా' కు అర్థం చెపితే నవ్వేసి పూరు కున్నాడు. వాడికి రెండవ ఆలోచన ఉన్నట్టు ఉండదు- కాఫీలు, టిఫిన్లు తేవడం తప్ప!

ఎందుకు వాడంటే ఆసక్తి పెరిగిపోతూంది? ఆ వయస్సులో వాళ్ళు రోజూ స్కూలుకు వెళ్ళడం, సాయంకాలం ఆడుకోవడం, పండుగ ఏదైనా వస్తే తల్లితండ్రులు కుట్టించిన కొత్త బట్టలు వేసు కోవడం—వీటన్నింటికీ అతీతుడు కావడం అనుకుం టాను, నా ఆసక్తికి కారణం. అవేవీ వాడికి ఒంట బట్టవు. వాడికి వర్తించవు. అందుకనే వాడు నాకు వెరైటీ!

ఆలోచిస్తూ ఉండగానే కాఫీ తెచ్చాడు. ఈసారి వాడి వెనకే ఇంకొకడు వచ్చాడు. కొంచెం శుభ్రంగా ఉన్న షర్టు, నిక్కరు. వాడేదో అంటున్నాడు.

''ఉండ్రా. ఇత్తానన్నాను. ఈ రందరికీ కాఫీ లిచ్చేయనీ'' అంటున్నాడు డ్రాక్యులా.

డ్రాక్యులాను అడిగాను విషయం.

''ఈడు నా తమ్ముడండీ. ఇస్కూల్లో సదుం తున్నాడండీ. జీతం కట్టాలంటండీ. ఇందాక ట్నుంచీ పట్టుకు పీడించేత్తున్నాడండీ.''

''నువ్వు కడతావా వాడికి జీతం?''

''మరేనండీ. ఆడు బాగా సదుంకోవాలండీ...'' అలా అంటున్నప్పుడు వాడి కళ్ళలో ఏదో సన్నని మెరుపు! తనకు లేని దేదో తమ్ముడు పొందాలన్న తపన!

''మా బాబాయి ఆణ్ణి సదివించకుండా ఏదో పన్లో పెట్టేత్తనన్నాడండీ. నే నొప్పుకోలేదండీ. అయితే, ఆడి కట్టాల్సిందంతా నువ్వే కట్టాల్రా. అలా అయితేనే సదుంకోనియ్ అన్నాడండీ. అప్పుడే నాలుగో క్లాసు సదుం తున్నాడండీ ఈడు.'' డ్రాక్యులా గాడు ఆ క్షణంలో చాలా గొప్పవాడు అనిపించింది. వాడికి చదువు లేదని తమ్ముడికి దాన్ని నేర్పిస్తున్న మహా పురుషుడు. చాలా మంది చెయ్యలేని మహా త్యాగం. చాలా మంది అన్నలే కాదు, తండ్రులే చెయ్యలేని పని వాడు చేస్తున్నాడు. వాడికి చేతు లెత్తి నమస్కారం పెడదా మనిపించింది.

● ● ●

ఒక నెల గడిచింది.

నేను కాంపు మీద చాలా ఊర్లు వెళ్ళడం జరిగింది. మళ్ళీ వచ్చి జాయిన్ అయి అప్పుడప్పుడే ఆఫీసు రొటీన్‌లో పడుతున్నాను. అలవాటు తప్పి పోవడం వల్ల డ్రాక్యులాగాడి సంగతి మరిచి పోయాను. నాలుగు రోజులు పోయాక వాడు లేని లోటు తెలిసింది.

ఒక రోజు చిన్న కుర్రవాడు తెల్ల కాగితా లిమ్మని నా దగ్గరికి వచ్చాడు. వాణ్ణి అడిగిన మీదట తెలిసింది —వాడు డ్రాక్యులాగాడి 'చదువుకునే తమ్ము'డని. డ్రాక్యులా సంగతి అడిగాను వాణ్ణి.

''అన్నయ్యాండీ? ఇంకో ఊర్లో పెద హోటల్లో పెట్టాడండీ మా బాబాయి. అన్నీ అక్కడే ఇచ్చి పైగా పంద రూపాయ లిత్తారంటండీ. అక్కడ హోటల్లోనే పని చెయ్యాలంటండీ. ఇలా రోడ్డమ్మట తిరిగి కెళ్ళ నక్కర్లేదంటండీ.'' చిన్నవాడు కావడం వల్ల ఆయాసం వచ్చి ఆగాడు.

''అన్నయ్యను పంపించి, నువ్వు డబ్బు పంపు తూండు. నేను తమ్ముణ్ణి చదివిస్తాను' అన్నా డండీ మా బాబాయి. మాహ్హాడా గడుత్తాది, నీ తమ్ముణ్ణి సదివించినట్టు అవుద్ది అని అన్నయ్యని పంపించేశాడండీ'' అన్నాడు. పుస్తకం కుట్టుకోవ డానికి తెల్ల కాగితా లిచ్చి పంపించేశాను వాణ్ణి.

డ్రాక్యులా గాడి సంగతి తెలిసినందుకు చాలా సంతోషంగా ఉంది. వాడు పైకి వస్తున్నందుకు ఒక పక్క, తమ్ముణ్ణి బేషుగ్గా చదివించుకుంటు న్నందుకు ఒక పక్క. వాడూ మనిషంటే.

ఒక రోజు ఎప్పటి మాదిరిగానే ఫైళ్ళలో మునిగి ఉన్నాను. మన సంతా చెప్పలేనంత చిరాకుగా ఉంది. కారణం తెలియడం లేదు. ఇంతలో ఎవరో వచ్చి నన్ను అడుగుతున్నారు. ప్యూను పేరు సరిగా చెప్పమని రెట్టిస్తున్నాడు. ఎవరో ఆడ మనిషి. లోపలికి పంపించమన్నాను. ఆవిడకి కనీసం నలభై ఏళ్ళు ఉంటాయి. చింపిరిజుట్టు, మురికి చీర. సంగ తేమిటని ప్రశ్నించాను.

''అయ్యగారూ! మిమ్మ ల్నింత వరకూ చూడనే లేదండీ. మా కోటిగాడు ఇంటికాడ గూడా మీ గురించి సెపుతూంటాడండీ. శాన మంచోరంట మీరు. ఆణ్ణి శానా బాగా సూసుకుంటారంట. అయ్యగారూ, ఇప్పుడు మా కొంప మీద కో సమస్య వచ్చి పడిందండీ. కోటిగాడి బాబాయి లేడండీ? ఆడేనండీ మా మగోడు ఏ పనీ చెయ్యడండీ. ఆడికి ఒక కాలు లేదండీ. ఈ మధ్యన సారా తాగడంకూడా మొదలెట్టాడండీ. కోటిగాటికి ఆడి తమ్ముడంటే ప్రాణం అండీ...'' ఊపిరి తీసుకోవడానికి ఆగింది.

ప్యూన్ని పిలిచి మంచి నీళ్ళు తెమ్మని చెప్పాను.

''అయ్యగారూ, పై ఊళ్ళో హోటల్లో అన్నీ పెట్టి, పొంద ఇత్తారని మా వాడికి తెల్సి కోటిగాణ్ణి అక్కడికి పంపించారండీ. ఆడు సక్కగా డబ్బు పంపిత్తున్నాడండీ. మరి డబ్బులు సూడగానే మాయ దారి రోగం ఏమొచ్చిందో మా మగోడు చిన్నాణ్ణి ఇస్కూలు మానిపించి, ఇక్కడ ఇదివరకు కోటయ్య సేసే హోటల్లో పెట్టేత్త నంటున్నాడండీ. మొన్ననే ఆ డొచ్చి ఎల్లాడండీ. ఆడికి, ఆడి బాబాయికి చాలా గొడవ జరిగిందండీ. తమ్ముణ్ణి సదివించమని ఆడూ, నా ఇష్టం—డబ్బు పొచ్చేటప్పు డెందుకు



ఇడిచి పెట్టాలని ఆడి బాబాయి అండీ. చివరికి తనో తీసికెళ్ళి పోతనన్నడు. అడి బాబాయి ఒప్పుకో లేదండీ. పైగా కోటిగాణ్ణి బండ బూతులు తిడుతూ కొట్టాడండీ. ఆ డొక్కడు తిరిగి మళ్ళీ సన్లో జేరకపోతే సంపేత్తా నన్నాడు. ఇక ఆడేం సెయ్యగలడు? తమ్ముణ్ణి ఒటేల్లో నాలాగే యెట్టు తంటే నేనేమై పోతానో నాకే తెలీదని బెదిరించా డండీ. ఆడి బాబాయి సర్లేరా అని చెప్పి ఆణ్ణి బలవంతాన రైలెక్కించా డండీ. అయ్యా, మా వోడికి మీ రైనా చెప్పండి—చిన్నోణ్ణి సదివించమని. పెద్దోలు—మీరు సెబితే కాదనడు. ఆడికి డబ్బు యావ బాగా పట్టుకుంది.'' ఏడుస్తూ ముగించింది.

''మీ ఆయన్ని ఒకసారి కలవమను'' అని చెప్పి ఆవిణ్ణి పంపించేశాను. మనసు కలతబారింది. డ్రాక్యులాగాడు ఎంత ఆశలు పెంచుకుంటున్నాడో అవి అంత అడుక్కి వెళ్ళిపోతున్నాయి. బలహీనుడు. చిన్నవాడు. ఎంతని పెద్దవాడి మాట కాదనగలడు? నేనైనా కొంచెం నచ్చజెప్పాలి.

మళ్ళీ రెండు రోజులు కాంపులో ఉన్నాను. తిరిగి ఆఫీసు పనిలో చేరి రొటీన్‌లో పడుతున్నాను.

''కాఫీ తెమ్మంటారా, సార్?'' చిరపరిచితమైన గొంతు కాదు. దీనిలో చదువు ఉంది. సంస్కారం ఉంది. చటుక్కున తల ఎత్తి చూశాను. డ్రాక్యులా గాడి తమ్ముడు! ఉలిక్కిపడ్డాను. ఎవరో లోయలోకి తోసేసినట్లయింది. డ్రాక్యులాకు ఈ సంగతి తెలుసా? తన తమ్ముడు భవిష్యత్తు సర్వనాశన మయిపోయిందని వాడికి తెలుసా? తెలిస్తే తట్టుకో గలడా?

వాడి 'ఇక చదువుకోని' తమ్ముణ్ణి పిలిచి, బాబాయిని ఒకసారి పిలుస్తున్నానని చెప్పు అన్నాను.

ఒక గంటకు చెక్క కాలుతో, చంకల్లో కర్రలు పట్టుకొని ఒకతను వచ్చాడు. అతనే వాడి బాబాయి. జీబురు జుట్టు, మాసిపోయిన గడ్డం. ముతకబారి పోయిన బట్టలు...అసహ్యంగా ఉన్నాడు.

కొంచెం అలా వరండాలోకి తీసుకువెళ్ళి ప్రశ్నిం చాను— ''కోటయ్య బాబాయి నువ్వేనా?'' అని.

''ఔరే, బాబూ.''

''చూడు, నీ పేరేమిటి?''

''ఆదెయ్యండి.''

''ఆదెయ్యా, నీ కో విషయం చెప్పాలని పిలిపిం చాను. కోటయ్యకు తమ్ముడంటే ప్రాణం. వాడిని చదివించాలని అతను చాలా ఆశ పడుతున్నాడు. నీకు వాడు డబ్బు పంపుతున్నాడు కదా! ఇంకా నీ కెందు కీ డబ్బు యావ! కొంచెం చదువుకున్న వాణ్ణి—చెప్పు తున్నాను. నీ కన్న కొడుకైతే ఇలానే చేస్తావా?''

''అయ్యగారూ, కన్న కొడుకు లేకపోవడంవల్లనే ఆణ్ణి పంపించిగానీ, ఈణ్ణి పన్లో పెట్టలేకపోయాను. కన్న బిడ్డలుంటే అందర్నీ నా కళ్ళ ముందరే అన్ని దుకాణాల్లోను పెట్టేసేవాణ్ణి. అయినా, మా ఆకలి మాది. మీరెవరు తీర్చడానికి, ఆర్చడానికి. చెప్పండి?'' మందుమీద ఉన్నట్టున్నాడు. వాసన సన్నగా వస్తూంది.

నా కేమనాలో తోచలేదు.

''అయ్యగారూ, అనకూడదు గానండీ, మీరు బీదోళ్ళు అయ్యుంటే తెల్సేదండీ. వత్తాను'' అంటూ టక టక లాడించుకుంటూ వెళ్ళిపోయాడు. నా గుండె మీద నుండి నడిచి వెళ్ళినట్టయింది. ఇక వీడు ఎవరు ఏమి చెప్పినా వినడు.

ఇది జరిగిన నాలుగు రోజులకు నా పేరుమీద ఒక ఉత్తరం వచ్చింది. పరిచయం లేని చేతి వ్రాత. విప్పి చూశాను.

''సార్, నమస్కారం. నేను ఈ టౌను 'రామా కాఫీ విలాస్' ప్రొప్రయిటర్ని. నా దగ్గిర మీ వూరి నుంచి వచ్చిన కోటయ్య అనే కుర్రవాడు పని చేస్తు న్నాడు. చాలా మంచివాడు. పని చాలా చురుకుగా చేస్తాడు. ఈ మధ్య అతను తన వూరు వెళ్ళి వచ్చాడు. వచ్చిన దగ్గరినించీ అదో మాదిరిగా ఉంటున్నాడు. తరవాత రెండు రోజులకు అతనికి ఒక ఉత్తరం వచ్చింది. ఎవరో ఆ వూర్లో హొటల్ కుర్రవాడు వ్రాశాడు. దాన్ని చదివి పెట్టమన్నాడు.

అందులో వాడి తమ్ముడు హొటల్ పనిలో చేరినట్టు ఉంది. ఒక్కసారిగా ఆదోలా అయిపోయాడు. అప్పటినించీ ఏమీ సరిగా తినేవాడు కాదు. మొన్న ఒక రోజున హొటల్ వరండామీద నురగలు కక్కుతూ పడి ఉన్నాడు. మేమంతా పోగయి హాస్పి టల్‌కు చేర్చేసరికి చనిపోయాడు. చాలా ఘోరంగా చచ్చిపోయాడు, సార్. హాస్పిటల్‌లో చేర్చిన పది నిమిషాల్లో అడగ్గా అడగ్గా మీ పేరు, ఆఫీసు, వూరు చెప్పగలిగాడు. అందుచేత మీకు ...''

ఇక నాకేమీ కనుపించడం లేదు. కళ్ళు మసక బారాయి. కన్నీళ్ళు వర్షిస్తున్నాయి.

డ్రాక్యులా! కోటయ్యా!! ఎంత పని చేశావురా!

ఎందుకు చనిపోయి ఉంటాడు? అదొక్కటేనా కారణం? అదే అయి ఉంటుంది ... ఎదురుగా—

''కాఫీ పట్టుకురమ్మంటారా, సార్?'' అని పిలుస్తున్నాడు కోటయ్య తమ్ముడు. ఇక ఎప్పటికీ చదువుకో అని చెప్పే అన్న లేని తమ్ముడు! ★

త్వరలో ప్రారంభం!  త్వరలో ప్రారంభం!

## ఆంధ్ర ప్రభ సచిత్ర వార పత్రికలో

ప్రతి మహాపురుషుని ఔన్నత్యానికి పట్టుగొమ్మగా ఒక మహిళ ఉంటుంది!

ఒక్కొక్క మహాసామ్రాజ్య నిర్మాణానికి ఆధారంగా ఒక వనిత ఉంటుంది!!

ఒక్కొక్క మహా నియంత పతనానికి, సామ్రాజ్య వినాశానికి కారణం స్త్రీ యే।

స్త్రీని అవమానించే జాతికి నిష్కృతి లేదు!

స్త్రీని గౌరవించలేని జాతి ప్రగతి సాధించదు!

పాశ్చాత్య నాగరికత వ్యామోహంలో పడి పవిత్రతకు, నీతికి నీళ్ళు వదులుకుంటున్నాం.

రోజు రోజుకు హత్యలు అమానుషాలు, రేప్‌లు, రాజకీయాలు దేశాన్ని అరాచకం చేస్తున్నాయి!

ఒక అమాయిక స్త్రీని రేప్ చేస్తే...

ఆ రేప్ 'వార్త' దావానలమై సమాజాన్ని, దేశాన్ని అతలా కుతలం చేసే అవకాశం ఉంది. అటువంటి కాల్పనిక సంఘటనలతో నిండిన రాజకీయ సంచలనాత్మక నవల

